వన్నె తగ్గిన బంగారం

రోజుకింత దిగొస్తున్న పుత్తడి ధరలు • హైదరాబాద్‌లో ఒక్కరోజే 10 గ్రాములు రూ.660 డౌన్

రూ.62,180 వద్ద 24 క్యారెట్ గోల్డ్ రేటు • గత వారం రోజుల్లో రూ.1,050 పతనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: బంగారం ధరలు క్రమేణా తగ్గుముఖం పడుతున్నాయి. గత వారం రోజులుగా దిగొస్తున్న రేట్లు.. బుధవారం భారీగా క్షీణించాయి. దీంతో హైదరాబాద్‌లో తులం ధర రూ.63 వేల దిగువకు చేరింది. ఈ ఒక్కరోజే 24 క్యారెట్ పసిడి విలువ 10 గ్రాములు రూ.660 క్షీణించి రూ.62,180 వద్ద నిలిచింది. 22 క్యారెట్ పుత్తడి రేటు కూడా 600 పడిపోయి రూ.57,000లుగా నమోదైంది. ఈ క్రమంలోనే గడిచిన వారం రోజుల్లో 22 క్యారెట్ గోల్డ్ ధర రూ.1,000, 24 క్యారెట్ రూ.1,050 కోల్పోయినట్టైంది. ఢిల్లీలోనూ ఇదే వరుస కొనసాగుతున్నది. బుధవారం స్పాట్ మార్కెట్‌లో రూ.750 క్షీణించి 24 క్యారెట్ పుత్తడి ధర రూ.62,350కి పరిమితమైంది.

గ్లోబల్ మార్కెట్ ఎఫెక్ట్

దేశీయ మార్కెట్‌లో క్షీణించిన డిమాండ్‌కు తోడు అంతర్జాతీయ విపణిలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులు.. బంగారాన్ని వెలవెలబోయేలా చేస్తున్నాయి. అంచనాలను మించి అమెరికా ద్రవ్యోల్బణం పెరగడం.. పుత్తడి ధరలకు సెగ పెడుతున్నదని ట్రేడింగ్ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం జనవరిలో 3.1 శాతంగా ఉన్నది. నిజానికి 2.9 శాతానికి దిగొస్తుందని ఊహించారు. కానీ ఆశించిన స్థాయిలో తగ్గకపోవడంతో రాబోయే ద్రవ్య సమీక్షల్లో వడ్డీరేట్లకు కోత పెడుతుందనుకున్న ఫెడరల్ రిజర్వ్.. మరికొంతకాలం కీలక వడ్డీ రేట్లను అధిక స్థాయిలోనే ఉంచవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామం గోల్డ్ నుంచి మదుపరుల పెట్టుబడులను దూరం చేస్తున్నది. మరోవైపు కోమెక్స్ స్పాట్ మార్కెట్‌లో ఔన్సు బంగారం విలువ 2వేల డాలర్ల దిగువకు పడిపోయింది. 1,995 డాలర్లు పలికింది. గత ముగింపు కన్నా ఇది 26 డాలర్లు తక్కువ. ఈ స్థాయికి పతనమవడం డిసెంబర్ నుంచి ఇదే తొలిసారి.

వెండి ధరలు కూడా..

వెండి ధరలూ పతనం దిశగానే నడుస్తున్నాయి. బుధవారం హైదరాబాద్‌లో కిలో ధర రూ.1,500 క్షీణించి రూ.75,500 వద్ద స్థిరపడింది. ఢిల్లీలోనూ రూ. 1,400 దిగి రూ.74,000లుగా నమోదైంది. గ్లోబల్ మార్కెట్‌లో ఔన్సు 22.82 డాలర్లుగా ఉన్నది. ఇండస్ట్రీ వర్గాల నుంచి డిమాండ్ లేకపోవడం కూడా మార్కెట్‌లో ధరల క్షీణతకు ఓ కారణమే నన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

మైలాన్ డ్రగ్ లైసెన్సు రద్దు

తెలంగాణ డీసీఏ చర్యలు • దారిమళ్లుతున్న 'అల్ప్రాజోలం'

హైదరాబాద్, ఫిబ్రవరి 14: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మైలాన్ లాబొరెటరీస్ సైకోట్రోపిక్ డ్రగ్ 'అల్ప్రాజోలం' తయారీ లైసెన్సు రద్దయ్యింది. రాష్ట్రంలోని తయారీ యూనిట్ నుంచి ఈ ఔషధాన్ని చట్టవిరుద్ధంగా మళ్లిస్తున్నారని కనుగొనడంతో ఈ చర్య తీసుకున్నట్టు తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) బుధవారం ప్రకటించింది. మానసిక రుగ్మతలకు, భయాందోళనల్ని తగ్గించడానికి ఉపయోగించే 'అల్ప్రాజోలం'ను వినోద ఉత్ప్రేరకంగా కూడా వాడుతుంటారు. మైలాన్ ఆవరణ నుంచి దీనిని అనధికారికంగా తరలిస్తున్నట్టు ఎక్సయిజు యంత్రాంగం ద్వారా తమ నోటీసులోకి వచ్చిందని డీసీఏ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్ రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని మైలాన్ యూనిట్ నుంచి 21.250 కిలోల 'అల్ప్రాజోలం' కెమిస్టులు, ప్రొడక్షన్ అధికారులుగా పని చేసే కొంతమంది ఉద్యోగుల ద్వారా చట్టవిరుద్ధంగా తరలించినట్టు ఎక్సయిజు అధికారులు గుర్తించారన్నారు. మైలాన్ లాబ్ యూనిట్-7 'కస్టూమబుల్ రూమ్'లో ప్రొహిబిషన్, ఎక్సయిజు అధికారులు గత ఏడాది 4.850 కిలోగ్రాముల స్వాధీనం చేసుకున్నట్టు డీసీఏ వివరించింది. ఈ అంశమై మైలాన్‌కు డీసీఏ తెలంగాణ షోకాజ్ నోటీసులు చేయగా, తగిన వివరణను కంపెనీ ఇవ్వలేకపోయిందని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల రీత్యా ఈ ఔషధం తయారీ లైసెన్సును రద్దుచేస్తున్నామని, ఇది తక్షణం అమలులోకి వస్తుందని డీసీఏ తెలంగాణ వివరించింది.

హైదరాబాద్‌లో గోద్రేజ్ భారీ ప్రాజెక్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో భారీ రియల్ ఎస్టేట్ డీల్ జరిగింది. ఇప్పటి వరకు వెస్ట్ జోన్ పరిధిలోని ఐటీ కారిడార్‌లోనే భారీ ప్రాజెక్టులకు అధిక ప్రాధ్యాన్యతనిచ్చిన రియల్ ఎస్టేట్ కంపెనీలు ప్రస్తుతం దక్షిణాదిలోనూ భారీ ప్రాజెక్టులు చేపట్టేందుకు ముందుకొస్తున్నాయి. ఈ క్రమంలో ముంబైకి చెందిన గోద్రేజ్ ప్రాపర్టీస్... హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై రాజేంద్రనగర్ వద్ద సుమారు 12.5 ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు బుధవారం ప్రకటించింది.

'సోడియం అయాన్ బ్యాటరీలు'

హైదరాబాద్, ఫిబ్రవరి 14: దేశీయ మార్కెట్లోకి శక్తివంతమైన సోడియం అయాన్ బ్యాటరీలు అందుబాటులోకి వచ్చాయి. ప్రముఖ బ్యాటరీల తయారీ సంస్థ సోడియన్ ఎనర్జీ వీటిని పరిచయం చేసింది. ఈ సందర్భంగా కంపెనీ కో-ఫౌండర్ బాల పాచాయప్ప మాట్లాడుతూ...లీథియం బ్యాటరీలతో పోలిస్తే తక్కువ ధరకు లభించడంతో పాటు ఎక్కువకాలం మన్నికను కలిగి వుండనున్నాయన్నారు.వచ్చే నెల నుంచి దేశవ్యాప్తంగా ఈ బ్యాటరీలు అందుబాటులోకి రానున్నాయి.

పేటీఎంపై ఈడీ దర్యాప్తు

ఆర్బీఐ నుంచి వివరాలు కోరిన ఏజెన్సీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: బ్యాంకింగ్ రెగ్యులేటర్ రిజర్వ్‌బ్యాంక్ నిషేధానికి గురైన పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)దర్యాప్తు ప్రారంభించినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు బుధవారం ముందుగా ఆర్బీఐ నుంచి మరింత సమాచారం కోరిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఈ పరిణామాన్ని పేటీఎం ధృవీకరించలేదు. ఫిబ్రవరి 29 తర్వాత పేటీఎం బ్యాంక్ డిపాజిట్లు తీసుకోరాదని, కస్టమర్ ఖాతాలు, వ్యాలెట్లలో టాప్ అప్స్. ఫాస్ట్‌ట్యాగ్స్, ప్రిపెయిడ్ సాధనాలు ఇవ్వరాదంటూ జనవరి 31న ఆర్బీఐ నిషేధ చర్యల్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. అలాగే పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై తాము ప్రకటించిన చర్యల్ని సమీక్షించే ప్రసక్తే లేదని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత్‌దాస్ రెండు రోజుల క్రితమే స్పష్టం చేసినదీ విదితమే. ఆర్బీఐ జనవరి 31న నిషేధ చర్యల్ని ప్రకటించిన తర్వాత 55 శాతం మేర మార్కెట్ విలువను కోల్పోయిన పేటీఎం మాతృసంస్థ ఒన్ 97 కమ్యూనికేషన్స్ షేరు బుధవారం మరో 10 శాతం పతనమై ఆల్‌టైమ్ కనిష్ఠస్థాయి రూ.343 వద్దకు పడిపోయింది.

ఫెమా చట్ట ఉల్లంఘన

విదేశాలకు నగదు బదిలీకి సంబంధించిన ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా)ను పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఉల్లంఘించిందన్న ఆరోపణలతో ఈడీ దర్యాప్తు మొదలుపెట్టింది. అయితే ఫారెక్స్ ఉల్లంఘనలకు పాల్పడలేదని ఇప్పటికే సంస్థ ఖండించినప్పటికీ, దర్యాప్తులో భాగంగా ఆర్బీఐ నుంచి మరిన్ని వివరాలను తెలుసుకుంటున్నది.

10 లక్షల ఏఐ నిపుణులు అవసరం

టీసీఎస్ ప్రెసిడెంట్ వీ రాజన్న

హైదరాబాద్, ఫిబ్రవరి 14: దేశీయ టెక్నాలజీ రంగంలో కృత్రిమ మేధస్సు కీలక పాత్ర పోషిస్తున్నది. ఇప్పటికే లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్న ఈ కృత్రిమ మేధస్సు భవిష్యత్తులోనూ పెద్దపీట లభించనున్నది. 2026 నాటికి ఏఐ నిపుణులు 10 లక్షల మంది అవసరమవుతారని టీసీఎస్ ప్రెసిడెంట్ వీ రాజన్న తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న హైసియా జాతీయ సమ్మిట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అన్ని రంగాల్లో ముఖ్యంగా ఉత్పత్తి, వ్యవసాయ, హెల్త్‌కేర్, విద్య రంగాల్లో ఏఐ కీలకపాత్ర పోషిస్తున్నదన్నారు. 2023లో 150 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్న ఏఐ మార్కెట్ విలువ వచ్చే 2030 నాటికి సరాసరిగా ప్రతి ఏడాది 36.8 శాతం వృద్ధిని నమోదు చేసుకోనున్నదన్నారు.

ఆకట్టుకున్న ఎన్ఎండీసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 14: దేశీయ మైనింగ్ దిగ్గజం ఎన్ఎండీసీ అంచనాలకు మించి రాణించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.1,469.73 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.903.89 కోట్ల లాభం కంటే ఇది 62 శాతం అధికం. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.5,746.47 కోట్లకు ఎగబాకింది. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రూ.5.75 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది.

మహీంద్రా లాభం 2,658 కోట్లు

ముంబై, ఫిబ్రవరి 14: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.2,658 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది మహీంద్రా అండ్ మహీంద్రా. అమ్మకాలు భారీగా పుంజుకోవడం వల్లనే క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.1,984 కోట్ల లాభంతో పోలిస్తే 34 శాతం వృద్ధిని కనబరిచింది. 2022-23 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.30,621 కోట్లుగా ఉన్న ఆదాయం గత త్రైమాసికానికి రూ.35,299 కోట్లకు చేరుకున్నది. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో సంస్థ 2,11,443 యూనిట్ల వాహనాలను విక్రయించింది. వీటితో పాటు లక్ష యూనిట్ల ట్రాక్టర్లను విక్రయించింది.

క్యూ3లో నాట్కో దూకుడు

హైదరాబాద్, ఫిబ్రవరి 14: నాట్కో ఫార్మా లిమిటెడ్ అంచనాలకుమించి రాణించింది. మూడో త్రైమాసికంలో సంస్థ రూ.212.7 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. కిందటి ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.62.3 కోట్లతో పోలిస్తే మూడు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. కంపెనీ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.758.6 కోట్లకు చేరుకున్నది. రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.1.25 మూడో మధ్యంతర డివిడెండ్‌ను ప్రతిపాదించింది.

హీరో మార్విక్ 440

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటోకార్ప్.. ప్రీమియం బైకుల సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మార్విక్ 440 పేరు తో విడుదల చేసిన ఈ బైకు ప్రారంభ ధర రూ.1.99 లక్ష లు కాగా, టాప్ మాడల్ ధర రూ.2.24 లక్షలుగా నిర్ణయించింది. ఈ బైకు ముందస్తు బుకింగ్‌లను ప్రారంభించింది.

అందరి కోసం బీమా సుగమ్

ఓ ఆన్‌లైన్ వేదికను ప్రతిపాదించిన ఐఆర్‌డీఏఐ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: దేశ ప్రజలందరికీ 2047కల్లా బీమా అందాలనే లక్ష్యంతో భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ ఐఆర్‌డీఏఐ.. ఓ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ప్రతిపాదించింది. పాలసీదారుల ప్రయోజనాల రక్షణ, సాధికారత కోసం 'బీమా సుగమ్' పేరుతో ఇన్సూరెన్స్ ఎలక్ట్రానిక్ వేదికను తేవాలని ఐఆర్‌డీఏఐ పేర్కొన్నది. పాలసీ కొనుగోలుదారులకు కావాల్సిన, అవసరమైన అన్నీ ఇందులో లభించేలా దీన్ని సిద్ధం చేయాలని ఇన్సూరెన్స్ కంపెనీలకు సూచించింది. బీమా సంస్థలు, మధ్యవర్తులు, ఏజెంట్లు, ఇతర భాగస్వాములందరికీ ఉపయోగపడేలా దీన్ని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉన్నట్టు అభిప్రాయపడింది. బీమా సుగమ్ ఏర్పాటుకు కావాల్సిన నిధులను బీమా కంపెనీలు సమకూర్చాలన్నది.

'ఫ్రీ లుక్' వ్యవధి 30 రోజులు!

పాలసీదారులు తాము తీసుకున్న పాలసీలో నిబంధనలు, షరతులు నచ్చకపోతే వాటిని పేర్కొంటూ తిరిగి దాన్ని వెనక్కి చ్చేందుకున్న గడువు (ఫ్రీ లుక్ పీరియడ్)ను 15 రోజుల నుంచి 30 రోజులకు పెంచాలని ఐఆర్‌డీఏఐ ప్రతిపాదించింది. అలాగే జీవిత బీమా పాలసీలకు నామినేషన్ తప్పనిసరి అని కూడా చెప్పున్నది. పైన పేర్కొన్న ఈ ప్రతిపాదనలన్నింటికి సంబంధించి ముసాయిదాను విడుదల చేయగా.. దీనిపై బీమా కంపెనీలు, ఇండస్ట్రీ భాగస్వాములు మార్చి 4కల్లా తమ అభిప్రాయాలను తెలియపర్చాలన్నది.